సాక్షి
జనగామ

శుక్రవారం | 26 | జూలై | 2024

I





నేడు కాళేశ్వరానికి బీఆర్ఎస్ బృందం -IIలో

కాళేశ్వరం ప్రాజెక్టును బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర బృందం శుక్రవారం సందర్శించనుంది.

గరిష్ఠం/కనిష్ఠం $33^0/26^0$

వాతావరణం

ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా జల్లులు కురుస్తాయి. మధ్యాహ్నం సమయంలో సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

విజయమో.. వీరమరణమో

- వెనకడుగు వేసేది లేదని ముందుకు సాగడమే
- ప్రతీ సైనికుడిలో ఇదే స్ఫూర్తి కనిపించేది
- మా కళ్ల ముందే చనిపోతుంటే బాధగా ఉండేది
- ఉమ్మడి జిల్లా సైనికులు కార్గిల్ యుద్ధ అనుభవాలు
- యుద్ధ సమయంలో వివిధ విభాగాల్లో సేవలు

నేడు కార్గిల్ విజయ్ దివస్

యుద్ధంలోకి దిగాక విజయమో.. వీరమరణమో అనేలా ప్రతీ సైనికుడిలో కనిపించేది. ఒకవైపు ప్రాణాలు పోతున్నా.. తుపాకీ వీడకపోయేది' అని అంటున్నారు.. కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న ఓరుగల్లు సైనికులు. కార్గిల్.. శ్రీనగర్, లేహ్, పాడమ్ నుంచి సుమారు 200కిలోమీటర్ల దూరంలోని వాస్తవాధీనరేఖ ప్రాంతమది. మంచుకొండల చాటును దొంగదెబ్బ తీయాలనుకున్న పాకిస్తాన్ కుట్రలను దీటుగా ఎదుర్కొంది భారత సైన్యం. దొడ్డిదారిన భారత భూభాగాన్ని ఆక్రమించుకోవాలని చూసిన పాక్‌సైనికులకు మన ఆర్మీ తన పరాక్రమాన్ని రుచి చూపించి తోక ముడిచేసేలా చేసింది. 1999 మే3వ తేదీనుంచి జూలై 26వరకు 73 రోజులపాటు సుదీర్ఘంగా జరిగిన యుద్ధంలో భారతదేశం విజయభేరి మోగించింది. యుద్ధం ముగిసిన జూలై 26న (నేడు) కార్గిల్ విజయ్‌దివస్‌గా జరుపుకుంటున్నాం. ఈ యుద్ధంలో ఉమ్మడి వరంగల్ జిల్లా సైనికులు పాలుపంచుకున్నారు. ప్రాణాలు లెక్క చేయకుండా పాక్ సైనికులను తరిమికొట్టారు. మరికొందరు వివిధ సైనిక విభాగాల్లో సేవలందించారు. నేడు (శుక్రవారం) కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా ఆనాడు యుద్ధంలో పాల్గొన్న ఉమ్మడి జిల్లా సైనికులు (రిటైర్డ్) తమ అనుభవాలను 'సాక్షి'తో పంచుకున్నారు. యుద్ధ నేపథ్యం, జరిగిన తీరు, మంచుకొండల్లో కష్టాలు తదితర అంశాలను వివరించారు. - హన్మకొండ

- వివరాలు IIలో

న్యూస్‌రీల్

రేపు న్యాయ విజ్ఞాన సదస్సు

జనగామ రూరల్: అగ్రి లీగల్ ఎయిడ్‌పై పాలకుర్తి మండలం బొమ్మెరలో ఈనెల 27న న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.రవీంద్ర శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. నల్సార్ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ శ్రీకృష్ణదేవరావు పాల్గొంటారని.. వ్యవసాయం, ధరణికి సంబంధించిన న్యాయ సలహాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

మాంసం విక్రయ కేంద్రాల తనిఖీ



జనగామ: పట్టణంలోని మాంసం విక్రయ కేంద్రాలను పెంబర్తి పశువైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యాన మున్సిపల్ ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మల్లిగారి మధు, జవాన్ లక్ష్మయ్య గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాంసం విక్రయించే సమయంలో దుకాణాదారులు పరిశుభ్రతను పాటించాలని, నిల్వ చేసిన, పాడైపోయిన, రోగాల బారిన పడిన గొర్రెలు, మేకల మాంసాన్ని విక్రయిస్తే కేసులు తప్పవన్నారు. మాంసం విక్రయించే దుకాణదారులు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు.

హోటళ్లలో సబ్సిడీ సిలిండర్లు



జనగామ: పట్టణంలోని పలు హోటళ్లలో వినియోగిస్తున్న సబ్సిడీ సిలిండర్లను గురువారం సివిల్ సప్లయిస్ అధికారులు దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారంతో సివిల్ సప్లయిస్ డీటీలు ఇట్టబోయిన శ్రీనివాస్, జి.దేవా ఆధ్వర్యాన తనిఖీలు నిర్వహించి 26 సబ్సిడీ సిలిండర్లను పట్టుకుని శ్రీ వీరభద్ర గ్యాస్ ఏజెన్సీలో భద్రపరిచారు. తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు సిలిండర్లను అక్కడే ఉంచాలని ఆదేశించారు.

రేపు అథ్లెటిక్స్ ఎంపికలు

జనగామ రూరల్: జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు పట్టణంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో ఈనెల 27న నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెద్ది వెంకటనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. 14, 16, 18, 20 ఏళ్ల వయసు బాలబాలికలకు జావలిన్ త్రో, 100, 400 మీటర్ల పరుగు పోటీలు ఉంటాయని, సర్టిఫికెట్లతో శనివారం ఉదయం 9 గంటలకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 9885046437, 9912453220, 7799552233 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నేటి నుంచి స్పాట్ అడ్మిషన్లు

జనగామ రూరల్: యాదాద్రి భువనగిరి రీజియన్ పరిధి సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు జనగామ సాంఘిక సంక్షేమ కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తిలో బాలికల కళాశాలలు, జఫర్‌గఢ్, నర్మెట, చేర్యాలలో బాలుర కళాశాలలు ఉన్నాయన్నారు. ఈనెల 26న బాలికలకు పాలిటెక్నిక్ కళాశాల బీబీనగర్‌లో, 27న బాలురకు భువనగిరి సాంఘిక సంక్షేమ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు ఉంటాయన్నారు. ఉదయం 10 నుంచి ఒంటిగంట వరకు అప్లికేషన్లు స్వీకరించి, 2 గంటల నుంచి సీట్లు కేటాయిస్తారని పేర్కొన్నారు. మార్చిలో రెగ్యులర్‌గా పాస్ అయిన పదో తరగతి విద్యార్థులు అర్హులని, ఒరిజినల్ సర్టిఫికెట్లతో రావాలని తెలిపారు.

మొక్కలను సంరక్షించాలి

జనగామ: జిల్లాలో పచ్చదనం మరింత పెంపొందించేందుకు నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి వెంకట శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం ఆర్టీసీ జనగామ డిపో ప్రాంగణంలో నిర్వహించిన వనమహోత్సవంలో డిపో మేనేజర్ ఎస్.స్వాతితో కలిసి ఆయన మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం మాట్లాడుతూ మొక్కల పెంపకంతో బస్టాండుకు వచ్చే ప్రయాణికులకు స్వచ్ఛమైన గాలిని అందించడంతో పాటు వేసవిలో నీడకు ఆస్కారం ఉంటుందన్నారు.

భరోసా.. నిరాశ..



సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్‌లో రూ.648 కోట్లు ◆ 'దేవాదుల', చిన్న కాళేశ్వరం ప్రాజెక్టులపై ఫోకస్..

- రామప్ప, పాకాల, ఇతరాలకు నిధులు
- ఎకో టూరిజం సర్క్యూట్‌లో పాకాల, ఏటూరునాగారం
- సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి ఊసే ఎత్తని వైనం
- గ్రేటర్ వరంగల్‌పై స్పష్టత కరువు.. నిరాశలో నగరవాసులు
- 2024–25 బడ్జెట్ కేటాయింపులు, అమలుపైనే జనం ఆశలు

సాక్షిప్రతినిధి, వరంగల్:

ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2024–25 బడ్జెట్ భరోసానిచ్చింది. విద్య, వైద్యం, వ్యవసాయం, ఇరిగేషన్‌తోపాటు 2023 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మేనిఫెస్టోలో పేర్కొన్న పలు పథకాల కొనసాగింపునకు పద్దులు కేటాయించి ఊరట కల్పించింది. కానీ ఇటీవల వరంగల్‌లో పర్యటించిన సీఎం రేవంత్‌రెడ్డి 'గ్రేటర్' అభివృద్ధి కోసం ఎనిమిది ప్రధాన అంశాలపై చర్చించి రూ.6,115 కోట్లు ఖర్చువుతుందని అంచనా వేసినా.. ఆ నిధుల కేటాయింపుపై స్పష్టత ఇవ్వలేదన్న చర్చ జరుగుతోంది. అలాగే.. ఉత్తర తెలంగాణకు ప్రామాణికంగా పరిగణించే సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి పనులకు కేటాయింపుల ఊసే లేదు. ఆరు గ్యారంటీల కింద ఇచ్చిన హామీల కొనసాగింపునకు ఢోకా ఉండదని అందులో స్పష్టం చేశా రు. రైతు రుణమాఫీ, రైతుబంధు తదితర పథకాల ను దృష్టిలో పెట్టుకుని వ్యవసాయానికి రూ.72,659 కోట్లు కేటాయించడం ద్వారా ఉమ్మడి వరంగల్‌కు భారీ ప్రయోజనం చేకూరనుంది.

మహాలక్ష్మి, గృహలక్ష్మిపై ఆశలు..

అధికారులు ప్రజాపాలన తర్వాత ప్రకటించిన లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లాలో ఒక కార్పొరేషన్, తొమ్మిది మున్సిపాలిటీలు, 1,708 గ్రామపంచాయతీలు ఉన్నాయి. సుమారు 38.22 లక్షల మంది జనాభాలో 19.09 లక్షల మంది మహిళలు ఉన్నారు. ఇందులో ఆరుగ్యారంటీల హామీలలో భాగంగా మహాలక్ష్మి పథకం కింద ప్రతి మహిళకు రూ.2,500 చొప్పున ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఇందుకు దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన సుమారు 7.21 లక్షల మందికి ఇవ్వాల్సి వస్తుంది. అలాగే గృహలక్ష్మి కోసం గతేడాది డిసెంబర్ నుంచి ఈ ఏడాది జనవరి 6 వరకు గ్రామ పంచాయతీలు, పురపాలక సంఘాల్లో వార్డు సభలు నిర్వహించి ప్రజాపాలనలో ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా 11,89,692 లక్షల దరఖాస్తు చేసుకున్నారు. వీటన్నింటిని ప్రజాపాలన ప్రత్యేక వెబ్‌సైట్‌లో నమోదు చేయగా.. అర్హుల జాబితా ప్రకటన కోసం ఎదురు చూస్తున్నారు.

- ఆర్టీసీ బస్సుల్లో వరంగల్ రీజియన్‌లో రోజుకు సగటున సుమారు 55వేల మంది మహిళలు ఉచితంగా రాకపోకలు సాగిస్తున్నారు. అదే విధంగా 6,10,220 గ్యాస్ కనెక్షన్లపై రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకంలో లబ్ధిదారులకు అందజేస్తుండగా.. గృహజ్యోతి ద్వారా 200 యూనిట్ల లోపు కరెంట్ వాడిన 6,12,901 మందికి ఉచిత విద్యుత్తు సౌకర్యం కల్పిస్తున్నారు. ఇంకెవరన్న అర్హులుంటే కూడా వర్తింపజేస్తామంటూ.. ఈ మూడు పథకాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించి మహిళలకు భరోసా కల్పించారు.

పంటలు, రైతులకు బీమా ధీమా...



ఉమ్మడి వరంగల్‌లో 15,01,109 ఎకరాల్లో 4,33,229 మంది రైతులు వివిధ పంటలు సాగు చేస్తుండగా.. ఇందులో 4,33,118 మంది రైతులకు బీమా సౌకర్యం, 9,02,099 ఎకరాలకు పంటల బీమా వర్తింపజేయనున్నారు. ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీ కింద ఉమ్మడి జిల్లాలో 3.98 లక్షల మందికి లబ్ధి చేకూరిందని స్పష్టం చేశారు.

కీలక శాఖలకు అరకొర నిధులు...

కాకతీయ, కాళోజీ హెల్త్‌యూనివర్సిటీలు, పోలీసు కమిషనరేట్‌లకు అరకొర నిధులు కేటాయించారు. రాష్ట్రంలోని యూనివర్సిటీలకు రూ.500 కోట్లు ఇవ్వగా.. కాకతీయ యూనివర్సిటీ వాటా అందులోనే ఉంది. కాళోజీ యూనివర్సిటీకి రూ.3 కోట్లు, పోలీసు కమిషనరేట్‌కు రూ.9 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు.

- గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఊసే లేకపోగా.. పనులు పురోగతిలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి ఈసారి ప్రత్యేకంగా ఏమివ్వలేదు. గతంలో కేటాయించిన నిధులతోనే పనులు కొనసాగింపు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. విద్య, వైద్యం కోసం రూ.11,468 కోట్లు కేటాయించిన ప్రభుత్వం.. వరంగల్ మెడికల్ హబ్, సూపర్ స్పెషాలిటీ, ఎంజీఎం, కేఎంసీలకు ప్రత్యేకంగా పేర్కొనకపోవడం నిరాశకు గురి చేసింది.

సామాజిక భద్రత, ఐటీ అవకాశాలు..

భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్న సుమారు 1,02,021 మంది రైతులకు, గిగ్ వర్కర్ల సంక్షేమానికి సామాజిక భద్రత స్కీమ్ కింద రూ.5 లక్షల ప్రమాద బీమా పథకం ద్వారా వివిధ వర్గాలకు చెందిన కార్మికులతో పాటు 4,891 మంది జర్నలిస్టులకు ప్రయోజనం కలగనుంది.

- దావోస్, అమెరికా పర్యటన ద్వారా రాష్ట్రానికి వేల కోట్ల పెట్టుబడులు తీసుకురానున్నామన్న ప్రకటన నేపథ్యంలో హైదరాబాద్ తర్వాత వరంగల్‌ను ఐటీ హబ్‌గా అంతే ప్రాధాన్యత దక్కి ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంది. ఐటీ హబ్, టెక్స్‌టైల్ పార్కు, మడికొండ పరిశ్రమల ద్వారా ఉపాధి అవకాశాలపై ఆశలు రేకెత్తుతున్నాయి.



విద్య, వైద్యం, పర్యాటకం, పర్యావరణం..

- విద్యకు ఈసారి కూడా రూ.21,292 కోట్లు కేటాయించగా.. ఉమ్మడి వరంగల్‌లో మొత్తం 3,331 ప్రభుత్వ బడులు ఉండగా, అందులో 5,28,704 విద్యార్థులు చదువుకుంటున్నారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు, ప్రహారీగోడలతోపాటు మౌలిక సదుపాయాల కల్పన కోసం ఈసారి నిధులు వెచ్చించనున్నారన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.
- ఎకో టూరిజం కింద తెలంగాణలోని ఏడు అటవీ ప్రాంతాలైన అమ్రాబాద్ టైగర్ రిజర్వు, కవ్వాల్ టైగర్ రిజర్వు, వికారాబాద్–అనంతగిరి సర్క్యూట్, ఖమ్మంలోని కనకగిరి, ఆదిలాబాద్‌లోని కుంటాల జలపాతం, కిన్నెరసానిలతోపాటు పాఖాల, ఏటూరునాగారం సర్క్యూట్‌లను గుర్తించనున్నట్లు ప్రకటించారు. దీంతో ఎకో టూరిజం కింద పర్యాటక అభివృద్ధిత పాటు అడవులు, పర్యావరణ పరిరక్షణ ద్వారా ఆదాయవనరులు సమకూరనున్నాయి.
- బడ్జెట్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కింద రూ.29,816 కోట్లు కేటాయించడం ద్వారా ఉమ్మడి జిల్లాలో 1,708 గ్రామపంచాయతీల అభివృద్ధికి నిధుల వాటా దక్కనుందన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

దేవాదుల, చిన్న కాళేశ్వరానికి నిధులు..



నీటిపారుదల, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యత దక్కింది. ఉమ్మడి వరంగల్‌లోని రెండు సాగునీటి చీఫ్ ఇంజినీర్ (వరంగల్, ములుగు) కార్యాలయాల పరిధిలోని ప్రాజెక్టుల పూర్తికి రూ.648 కోట్లు కేటాయించారు. వరంగల్ సీఈ కార్యాలయం కింద ప్రాధాన్యత ప్రాజెక్టు జే చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం పూర్తి కోసం రూ.308 కోట్లు ఇచ్చారు. అదే విధంగా ములుగు సీఈ కార్యాలయంలో పరిధిలోని చిన్న కాళేశ్వరానికి రూ.223 కోట్లు, మోదికుంట వాగు ప్రాజెక్టుకు రూ.80.68 కోట్లు కేటాయించారు. రామప్పకు రూ.5 కోట్లు, పాకాలకు రూ.5 కోట్లు, లక్నవరానికి రూ.2 కోట్లు ఇచ్చారు. మల్లూరు వాగు, పాలెంవాగు, గుండ్లవాగులకు రూ.88.02 లక్షలు కేటాయించారు.

వ్యవసాయ రంగానికి పెద్దపీట



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2024–2025 బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి పెద్దపీట వేసింది. సంక్షేమ బడ్జెట్‌గా అభివర్ణించవచ్చు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, మహాలక్ష్మి ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు ఆర్థిక సాయం అందించేలా ఈ బడ్జెట్‌ను రూపొందించారు. మహిళా సాధికారితకు వీలు కలుగుతుంది. యూనివర్సిటీలకు మౌలిక సదుపాయాల కల్పనకు రూ.500కోట్లు కేటాయించడం హర్షణీయం.

ఆచార్య బి.సురేష్‌లాల్, కేయూ ఎకనామిక్స్ విభాగం అధిపతి

సమాన విద్య ఎలా సాధ్యం?



విద్యారంగాన్ని ప్రభుత్వం విస్మరించింది. విద్యారంగానికి 7.31శాతం నిధులు కేటాయించడం తీవ్ర నిరాశ కలిగించింది. తక్కువగా నిధులతో అందరికి నాణ్యమైన సమాన విద్య ఎలా సాధ్యమవుతుంది. గత ప్రభుత్వం పదేళ్లపాటు విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిందంటే కొత్త కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా విద్యాభివృద్ధి జరుగుతుందని భావించాం. కానీ బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయింపులు చూస్తే నిర్లక్ష్యమే కనిపిస్తుంది.

- కె.శ్రీనివాస్, డీటీఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు

జిల్లా అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి



గత ప్రభుత్వంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వివక్షకు గురైంది. హైదరాబాద్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించినట్లుగానే రెండవ రాజధానిగా చెప్పుకునే గ్రేటర్ వరంగల్‌కు కూడా నిధులు కేటాయించాలి. కంతనపల్లి ప్రాజెక్ట్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి. కాకతీయ యూనివర్సిటీకి కూడా ఉస్మానియా యూనివర్సిటీ మాదిరిగానే రూ.100 కోట్ల నిధులు కేటాయిస్తే బాగుండేది..

- తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు

సాగునీటికి కొదువ ఉండదు



రాష్ట్ర బడ్జెట్‌లో దేవాదుల అసంపూర్తి కాలువల నిర్మాణంతో పాటు భూసేకరణ కోసం నిధులు కేటాయించడం సంతోషంగా ఉంది. ఈ ప్రాజెక్టు కాలువల నిర్మాణ పనులు అసంపూర్తి వదిలేయడంతో సాగునీరు అందించ లేకపోతున్నారు. రిజర్వాయర్ల నుంచి చెరువులు, వాగులు, కుంటలకు నీటిని తరలించే పరిస్థితి లేకపోవడంతో ప్రమాదకర స్థాయికి భూగర్భ జలాలు పడిపోయాయి. దేవాదుల పనులు త్వరగా పూర్తయితే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది.

- మ్యాకల రమేష్, రైతు, తమ్మడపల్లి, బచ్చన్నపేట

'మత్తు'తో భవిష్యత్ చిత్తు

- జీవితాలను అంధకారం చేసుకోవద్దు
- వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా

జనగామ: 'మత్తు'తో భవిష్యత్ చిత్తవుతుంది.. గంజాయి లాంటి మత్తు పదార్థాలు సేవించి జీవితాలను అంధకారం చేసుకోవద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ అన్నారు. యశ్వంతాపూర్ క్రీస్తుజ్యోతి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం జనగామ డివిజన్ పోలీసుల ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన అవగాహన సదస్సును వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్, సీజేఐటీ డైరెక్టర్ వి.జయపాల్‌రెడ్డితో కలిసి ప్రారంభించిన అనంతరం సీపీ మాట్లాడారు. మత్తుతో యువత భవిష్యత్ ప్రమాదంలో పడిపోతోందని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పిల్లల బంగారు భవిష్యత్ కోసం తల్లిదండ్రులు రెక్కలు ముక్కలు చేసుకుని చదివిస్తున్నారని, వారి ఆశలను నెరవేర్చాల్సిన బాధ్యత విద్యార్థులు, యువతపై ఉందన్నారు. మత్తు పదార్థాల నియంత్రణకు కమిషనరేట్ పరిధిలో డ్రగ్స్ కంట్రోల్ విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మత్తు పదార్థాలు విక్రయించినా.. కొనుగోలు చేసినా.. వాటికి బానిసలుగా మారిన వ్యక్తుల సమాచారాన్ని–8712584473 నంబర్‌కు తెలియజేయాలని సూచించారు. వారి వివరాలు గోప్యంగా ఉంచడంతోపాటు పోలీసు శాఖ తరఫున నగదు పురస్కారం అందిస్తామని పేర్కొన్నారు. మానసిక వైద్య నిపుణులు గంగం సిద్ధారెడ్డి, ఏసీపీలు పార్థసారథి, భీమ్ శర్మ, సైదులు, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

సాంకేతిక లోపం సవరించాం

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ: ఇండియన్ బ్యాంక్ మల్కాపూర్ బ్రాంచ్ పరిధిలో రుణమాఫీ అర్హులకు సంబంధించి నెలకొన్న సాంకేతిక లోపాన్ని సవరించినట్లు కలెక్టర్ రిజ్వాన్ బాషా తెలిపారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ మొత్తం 2,982 మంది రైతులు రుణమాఫీ పరిధిలో ఉండగా.. 896 మంది రూ.లక్ష లోపు మాఫీకి అర్హులని పేర్కొన్నారు. మొదటి విడతకు సంబంధించి ఆధార్ డాటా షేరింగ్ సాంకేతిక సమస్య కారణంగా 861 మంది రైతుల పేర్లు జాబితాలో రాలేదని, ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించినట్లు చెప్పారు. జాబితాను బ్యాంక్ వద్ద అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. అనంతరం ఆయిల్‌పామ్ సాగుపై నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతూ.. జిల్లాలో ఆయిల్‌పామ్ పంటను ప్రోత్సహిస్తూ.. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ప్రతి బుధవారం ఏఈఓలు ఫర్టిలైజర్ దుకాణాలను సందర్శించి స్టాక్ రిజిస్టర్, విత్తనాలు, ఎరువుల నిల్వలను తనిఖీ చేయాలని చెప్పారు. ప్రతి శుక్రవారం జీపీలు, అంగన్‌వాడీలు, పాఠశాలలు, న్యూట్రీ గార్డెన్‌లను సందర్శించి కూరగాయల తోటల సాగును ప్రోత్సహించాలన్నారు.

భూసేకరణ ప్రక్రియ త్వరగా పూర్తిచేయాలి

ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు పనులు, చెక్ డ్యాంలు, జాతీయ రహదారుల నిర్మాణానికి భూసేకరణ ప్రక్రియపై కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌తో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో దేవాదుల పనుల పురోగతి, మిగతా పనులు పూర్తి చేసేందుకు అవసరమైన నిధుల ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. గౌరవెల్లి కెనాల్ కింద 322 ఎకరాల భూసేకరణ, పెండింగ్‌లో ఉన్న రహదారుల నిర్మాణం, ఇరిగేషన్ ప్రాజెక్టుల భూసేకరణ, మినీ టెక్స్‌టైల్ పార్క్, టీఎస్ఐపీసీ స్కీంకు సంబంధించి భూసేకరణ పూర్తి చేయాలని చెప్పారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

అంగన్‌వాడీలను ఆధునికీకరించాలి

జనగామ రూరల్: అంగన్‌వాడీలను పూర్వ ప్రాథమిక విద్యాలయాలుగా ఆధునికీకరించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. అంగన్‌వాడీల్లో కల్పించాల్సిన సదుపాయాలపై కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్‌తో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. అంగన్‌వాడీ సెంటర్‌కు పిల్లలు సమయానికి వచ్చేలా చూడడంతోపాటు అంకెలు, ఆంగ్ల అక్షరాలు, గణిత భావనలు అర్థమయ్యేలా బోధించాలని చెప్పారు. ఆయా శాఖల అధికారులు కేఆర్.లత, వినోద్‌కుమార్, జయంతి, రాము, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, జెడ్పీ సీఈఓ అనిల్‌కుమార్, పీఆర్ ఈఈ శ్రీనివాస్‌రావు, సీడీపీఓ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మంత్రులు సమాధానం చెప్పాలి

జనగామ: కేంద్ర బడ్జెట్ ప్రసంగంలో తెలంగాణ గురించి ప్రస్తావన రాలేదంటూ ప్రజల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేసిన కాంగ్రెస్ నాయకులు.. రాష్ట్ర బడ్జెట్‌లో ఏ ఒక్క నియోజకవర్గాన్ని ప్రస్తావించలేదు.. ఈ విషయంలో మంత్రులు సమాధానం చెప్పాలి.. లేదంటే పదవులకు రాజీనామా చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో జనగామ–వరంగల్ ఇండస్ట్రియల్ కారిడార్, టెక్స్‌టైల్ పార్కు, స్టేషన్‌ఘన్‌పూర్‌లో లెదర్ పార్క్, ప్రభుత్వ ఐటీఐ ఏర్పాటుకు నిధులు కేటాయించక పోవడాన్ని నిరసిస్తూ గురువారం జిల్లా కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీజేపీ ఆధ్వర్యంలో దహనం చేశారు. పోలీసులు నాయకులను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. పార్టీ ప్రధాన కార్యదర్శి శివరాజ్, ఉడుగుల రమేష్, దేవరాయ ఎల్లయ్య, కీర్తి వెంకటేశ్వర్లు, ఉల్లెంగుల రాజు, శ్రీనివాస్, వారనాసి పవన్‌శర్మ, అంజి, ధరావత్ రాజు, మహిపాల్, సంపత్ కుమార్, శ్రీకాంత్, విజయ్, కోటి, చందు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

తెలంగాణకు మొండిచేయి సిగ్గుచేటు

జనగామ: కేంద్ర బడ్జెట్ ప్రసంగంలో తెలంగాణ అనే పదం ఉచ్ఛరించ లేదు.. పునర్విభజన చట్టాన్ని ప్రస్తావిస్తూ ఆంధ్రా ప్రాంతానికి నిధులు కేటాయించి, తెలంగాణకు మొండి చేయి చూపించడం సిగ్గుచేటని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి జిల్లా కేంద్రం ఆర్టీసీ చౌరస్తాలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అంతకు ముందు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రంపై మోదీ కక్షపూరిత వైఖరిని అవలంబిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ రాజమౌళి, చెంచారపు బుచ్చిరెడ్డి, లింగాల నర్సిరెడ్డి, గుర్రపు బాలరాజు, బాల్‌రెడ్డి, గంగం నర్సింహారెడ్డి, రామచంద్రశి, నర్సింగరావు, వంగాల మల్లారెడ్డి, జక్కుల వేణు తదితరులు పాల్గొన్నారు.



ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

క్లుప్తంగా

30న జాబ్‌మేళా

కాశిబుగ్గ సెంటర్ : వరంగల్ ములుగు రోడ్డు సమీపం ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఈనెల 30వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పన అధికారి సీహెచ్.ఉమారాణి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తిగల ఉమ్మడి వరంగల్ జిల్లా నిరుద్యోగ యువకులు మాత్రమే తమ బయోడేటతోపాటు విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో 30వ తేదీన ఉదయం 10.30 గంటలకు జాబ్‌మేళాకు హాజరు కావాలని పేర్కొన్నారు. పూర్తి సమాచారం కోసం 9573885532 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

వరంగల్ మార్కెట్‌కు వరుసగా 3 రోజులు సెలవు

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు శనివారం నుంచి సోమవారం వరకు వరుసగా 3 రోజులు సెలవు ఉందని, ఈ సమయంలో ఎలాంటి క్రయ, విక్రయాలు జరగవని మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.నిర్మల ఒక ప్రకటనలో తెలిపారు. 27వ తేదీ శనివారం(వారాంతపు యార్డ్ బంద్), 28 ఆదివారం(వారాంతపు సెలవు), 29 సోమవారం బోనాల పండుగ(ప్రభుత్వ సెలవు) ఉందన్నారు. ఈ నేపథ్యంలో మార్కెట్ బంద్ ఉంటుందని తెలిపారు. ఈ విషయం రైతులు, వ్యాపారులు గమనించి తమ సరుకులను మార్కెట్‌కు తీసుకురావొద్దని తెలిపారు. మార్కెట్ 30వ తేదీన పునఃప్రారంభం అవుతుందని తెలిపారు.

7 నుంచి కేయూ పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలు



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో పీజీ కోర్సులు ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) రెండో సెమిస్టర్ పరీక్షలు ఆగస్టు 7వతేదీ నుంచి నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి నర్సింహాచారి,అదనపు పరీక్షల నియంత్రణాధికారి బీఎస్‌ఎల్ సౌజన్యజీ గురువారం తెలిపారు. ఆగస్టు 7, 9, 12, 14, 16, 19 తేదీల్లో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఆయా తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటలవరకు పరీక్షలు జరుగుతాయని వారు తెలిపారు.

ప్రీ పీహెచ్‌డీ ఫీజు నోటిఫికేషన్ వాయిదా

కాకతీయ యూనివర్సిటీ వివిధ విభాగాల్లోని ప్రీ పీహెచ్‌డీ పరిశోధకుల కోసం ఈనెల 24న విడుదల చేసిన ఫీజు నోటిఫికేషన్‌ను వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఎస్. నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి బీఎస్‌ఎల్ సౌజన్యజీ గురువారం తెలిపారు. పలు విభాగాల్లో ప్రీ పీహెచ్‌డీ కోర్సు పూర్తికాని నేపథ్యంలో ఆయా పరిశోధక విద్యార్థుల విజ్ఞప్తి మేరకు ఈ ఫీజు నోటిఫికేషన్‌ను వాయిదావేస్తున్నామన్నారు.

విజయమో.. వీరమరణమో

వెనకడుగు వేసేది లేదు.. ముందుకు సాగడమే

- ప్రతీ సైనికుడిలో ఇదే స్ఫూర్తి కనిపించేది
- కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న ఉమ్మడి వరంగల్ జిల్లా సైనికుల వెల్లడి
- నేడు కార్గిల్ విజయ్ దివస్



హన్మకొండ : జమ్మూకశ్మీర్ కార్గిల్‌లోని లడఖ్ ప్రాంతాన్ని ఆక్రమించుకోవాలని చూసిన పాకిస్తాన్ సైనికులపై భారత సైన్యం విరుచుకుపడింది. 1999 మే 3వ తేదీ నుంచి జూలై 26 వరకు జరిగిన యుద్ధంలో భారత సైన్యం చూపిన తెగువకు పాక్ మూక పారిపోయింది. యుద్ధం ముగిసిన జూలై 26వ తేదీని కార్గిల్ విజయ్ దివస్‌గా జరుపుకుంటున్నాం. ఈ పోరులో ఉమ్మడి వరంగల్ జిల్లా సైనికులు ఉన్నారు. నేడు (శుక్రవారం) కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా నాడు యుద్ధంలో పాల్గొన్న ఉమ్మడి జిల్లా సైనికులు (రిటైర్డ్) తమ అనుభవాలను 'సాక్షి'తో పంచుకున్నారు.

కార్గిల్ యుద్ధంలో రాకెట్ లాంచరే కీలకం



కార్గిల్ యుద్ధంలో రాకెట్ లాంచర్‌దే కీలక పాత్ర. రష్యా నుంచి కొనుగోలు చేసిన రాకెట్ లాంచర్లతోనే కార్గిల్ యుద్ధంలో విజయం సాధించాం. ఇందులో 40 బేరర్లు ఉంటాయి. శత్రువును మట్టుపెట్టడంలో ఈ గన్ ఎంతో కీలకం. మా యూనిట్‌లో 18 గన్‌లు ఉండేవి. నేను 1980లో ఆర్మీలో సిపాయిగా చేరా. అంచెలంచెలుగా సుబేదార్ మేజర్‌గా రిటైర్డ్ అయ్యా. 212 రాకెట్ రెజిమెంట్‌లో టెక్నీషియన్‌గా పనిచేశా. ఢిల్లీలో రాకెట్ రెజిమెంట్‌లో హవల్దార్‌గా పనిచేస్తున్న క్రమంలో 1999లో కార్గిల్ యుద్ధం మొదలైంది. వెంటనే కార్గిల్‌లోని ద్రాస్ సెక్టార్‌కు చేరుకున్నా. కార్గిల్‌లో ఏడు రోజులు ఉన్న నేను నాలుగు రోజులు యుద్ధ విధుల్లో పాల్గొన్న. మంచు పర్వతాల్లో వంట చేసుకునే అవకాశం లేకపోవడంతో హెలికాప్టర్ ద్వారానే భోజనం అందించేవారు. 18 నెలలు ఇక్కడే పనిచేశా. 2010 జూలైలో రిటైర్డ్ అయ్యా. నాతో పాటు విధుల్లో పాల్గొన్న రాంచీకి చెందిన సుబేదార్ రావత్ యుద్ధంలో చనిపోవడం బాధాకరం. వెపన్ పాడైతే ఒకటి, రెండు గంటల్లో సమకూర్చాలి.

- సామల ప్రభాకర్, సుబేదార్ మేజర్ రిటైర్డ్, హనుమకొండ



శత్రువులపై కాల్పులు జరుపుతున్న సైనికుడు

సైనికులు డూ ఆర్ డై లక్ష్యంతో పనిచేస్తారు



సైనికులు డూ ఆర్ డై లక్ష్యంతో పనిచేస్తారు. నేను పంజాబ్ బటిండాలో క్యాంపులో ఉండగా కార్గిల్ యుద్ధం మొదలైంది. ఎల్ 70 గన్ తీసుకుని రావాలని మాకు సమాచారం అందింది. దీంతో వెంటనే గన్ తీసుకుని కార్గిల్ టైగర్ హిల్స్‌కు చేరుకున్నాం. 15 రోజులు యుద్ధం జరిగిన ప్రాంతంలోనే ఉన్నా. ఏదైనా అత్యవసర సందర్భంలో రైఫిల్ చేరవేయాల్సి వస్తే అందుబాటులో ఉంచారు. 16 ఏళ్ల వయసులో 1985లో ఆర్మీలో చేరా. 131 ఏ డిఫెన్స్ ఆర్డినలరీ రెజిమెంట్‌లో డ్రైవర్‌గా విధులు నిర్వర్తించా. 2003లో రిటైర్డ్ అయ్యా. నేను ఉద్యోగంలో చేరినప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి ఎస్టీ కేటగిరీ నుంచి నేను ఒక్కడినే ఆర్మీలో ఉన్నా. నన్ను చూసి మా గ్రామానికి చెందిన 15 మంది ఆర్మీలో చేరారు. తల్లిదండ్రులకు చెప్పకుండానే ఆర్మీ సెలక్షన్‌కు వెళ్లి ఎంపికయ్యా.


- తేజావత్ రేనియా, ఆర్మీ డ్రైవర్, టేకులతండా, నెక్కొండ

యుద్ధంలో వైర్‌లెస్ విభాగం సేవలు అతి ముఖ్యం..



యుద్ధంలో వైర్‌లెస్ విభాగం సేవలు అతి ముఖ్యం. 1979లో ఆర్మీలో చేరిన నేను 136 ఫీల్డ్ ఆర్టిలరీ రెజిమెంట్‌లో వైర్‌లెస్ ఆపరేటర్‌గా పనిచేశా. కార్గిల్ యుద్ధ సమయంలో 6 నెలలు టైగర్ హిల్స్ పై ఉండి సేవలందించా. నేను ఇన్‌ఫెంట్ సెక్యూరిటీ రక్షణలో శత్రువుల స్థావరాలను గుర్తిస్తూ ఆర్మీ అధికారులకు సమాచారం అందించేవాడిని. మేము అందించిన సమాచారం మేరకు సైనికులు యుద్ధం చేసేవారు. బైనాక్యులర్ సాయంతో శత్రుస్థావరాలు, బంకర్లను గుర్తించేవారం. మేము శత్రు స్థావరాలను గుర్తిస్తుండగా మూడు సార్లు కాల్పులు జరిగాయి. మంచులో పాక్కుంటూ ముందుకెళ్తూ స్థావరాలను గుర్తించి అధికారులకు చెప్పేవారం. రాత్రి అయిందంటే కాల్పుల మోతే.. పగలు బంకర్లలో ఉండేవాళ్లం. రాత్రి సమయంలోనే యుద్ధం జరిగేది. మాతోపాటు విధులు నిర్వర్తించిన సైనికులు మా ముందే చనిపోవడం బాధాకరం.

- గుర్రం విద్యాసాగర్, ఆర్మీ వైర్‌లెస్ ఆపరేటర్, గణేశ్‌నగర్, శంభునిపేట, వరంగల్



కార్గిల్ యుద్ధ సమయంలో బైనాక్యులర్ సాయంతో సైనికుడు


రిజర్వ్‌గా ఉన్నాం..



కార్గిల్ యుద్ధంలో నేను నేరుగా పాల్గొనకున్నా రిజర్వ్‌గా ఉన్నాం. 1979 మే లో ఇండియన్ ఎయిర్ ఫోర్స్ లాజిస్టిక్ డిపార్ట్‌మెంట్‌లో ఎయిర్ క్రాఫ్ట్స్ మెన్‌గా చేరా. హైదరాబాద్ బేగంపేట్‌లో విధులు నిర్వర్తిస్తుండగా కార్గిల్ యుద్ధం ప్రారంభమైంది. మమ్ములను సపోర్టింగ్ స్టాఫ్‌గా రిజర్వ్‌గా ఉండాలని రహస్య సమాచారం అందించారు. 24 గంటలు డ్యూటీలో ఉన్నాం. అయితే మాకు కదన రంగంలో పాల్గొనే అవకాశం రాకుండానే కార్గిల్ యుద్ధం ముగిసింది.

- తండా సత్యనారాయణ, ఎయిర్ క్రాఫ్ట్స్‌మెన్, చింతపల్లి, కొత్తూరు (సీ), కురవి

యుద్ధంలో గాయపడిన వారికి వైద్య సేవలందించా



నాకు కార్గిల్ యుద్ధంలో సైనికులకు వైద్య సేవలందించే అవకాశం లభించింది. యుద్ధం మొదలుకాగానే ఆర్మీ మెడికల్ కోర్ బృందం కార్గిల్ చేరుకుని గాయపడిన వారికి చికిత్స చేశాం. నేను 1998లో ఆర్మీ మెడికల్ కోర్‌లో చేరా. 2002లో రిటైర్డ్ అయ్యా. ప్రస్తుతం జనగామ ఏరియా ఆసుపత్రిలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న. కార్గిల్ యుద్ధంలో 1200 మంది సైనికులు చనిపోయారు. భారతదేశానికి సియాచిన్ సెక్టార్ అత్యంత కీలకం. అయితే కార్గిల్‌ను ఆక్రమిస్తే సియాచిన్ సెక్టార్ మొత్తం తమ అదుపులోకి వస్తుందని పాకిస్తాన్ కార్గిల్ పర్వతాన్ని ఆక్రమించుకుంది. మన సైనికులు ధైర్యసాహసాలు ప్రదర్శించి శత్రు మూకలను తరిమికొట్టారు.

- కల్నల్ భిక్షపతి, ఆర్మీ డాక్టర్, బొమ్మెర, పాలకుర్తి

సియాచిన్ సెక్టార్ దేశానికి కీలకం...

- ఇక్కడ భారత సైనికుల కార్యకలాపాలు నివారించడానికే కార్గిల్ ఆక్రమణ
- యుద్ధ వివరాలు వెల్లడించిన మాజీ సైనికులు
- రాష్ట్ర ప్రభుత్వాలు తమ సంక్షేమాన్ని పట్టించుకోవాలని వేడుకోలు



'దేశానికి కీలకమైన సియాచిన్ సెక్టార్‌లో భారత సైనికుల కదలికలను నివారించేందుకు ప్రధాన స్థావరం కార్గిల్ టైగర్ హిల్స్‌ను పాకిస్తాన్ సైన్యం 1999లో ఆక్రమించింది. శీతాకాలం కావడంతో అప్పటి వరకు కార్గిల్ పర్వతంపై ఉన్న భారత సైనికులు దిగువకు చేరుకోగానే అదును చూసి పాక్ సైనికులు కార్గిల్ పర్వతం పైకి చేరుకున్నారు. అయితే ఒక గొర్రెల కాపరి కార్గిల్ పర్వతం పై ఎవరో వ్యక్తులు ఉన్నట్లు గమనించి భారత సైన్యానికి సమాచారం ఇచ్చారు. దీంతో భారత సైన్యం కార్గిల్‌పైకి పైకి చేరుకునే ప్రయత్నంలో పై నుంచి కాల్పులు ప్రారంభమయ్యాయి. దీంతో శత్రువులు ఆక్రమించుకున్నారని నిర్ధారణకు వచ్చిన భారత సైన్యం పూర్తి స్థాయిలో యుద్ధం చేపట్టింది' అని మాజీ సైనికులు తెలిపారు.

రిటైర్డ్ సైనికుల సేవలను గుర్తించాలి..

ప్రభుత్వం .. తమ సేవలను గుర్తించాలని రిటైర్డ్ సైనికులు వేడుకుంటున్నారు. దేశ రక్షణలో పాల్గొంటున్న సైనికుల సంక్షేమాన్ని ప్రభుత్వం చూసుకుంటుందన్నారు. అయితే రిటైర్డ్ అయ్యాకా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి నెలా రిటైర్డ్ అవుతున్న సైనికులతో ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు దర్బార్ నిర్వహించి వారి సేవలను గుర్తించాలని కోరారు. గతంలో మాజీ సైనికులకు ఐదెకరాల స్థలం ఇచ్చేవారని, స్థలాలు దొరకపోవడంతో ఇప్పుడు ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నట్లు కనిపిస్తోందని, ఈ క్రమంలో ప్రతి మాజీ సైనికుడికి 300 గజాల ఇంటి స్థలం ప్రభుత్వ ధరకు అందించాలని కోరారు. అదే విధంగా రాష్ట్రంలో ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు తమ సహకారాలు అందించే అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాలకు సూచించారు. అదే విధంగా రాజకీయంగా ఎమ్మెల్యే, ఎంపీలుగా పోటీ చేసే అవకాశం కల్పించాలన్నారు.

హోరాహోరీగా బ్యాడ్మింటన్ పోటీలు

- ఫైనల్‌కు చేరిన క్రీడలు

వరంగల్ స్పోర్ట్స్: ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని ఆఫీసర్స్ క్లబ్‌లో నిర్వహిస్తున్న 10వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్స్ (అండర్-17) బాలబాలికల బ్యాడ్మింటన్ పోటీలు గురువారం హోరాహోరీగా సాగాయి. సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో మూడు రోజుల పాటు కొనసాగుతున్న పోటీల్లో చాంపియన్‌షిప్ కైవసం చేసుకోవడానికి క్రీడాకారులు నువ్వా? నేనా అన్నట్లు తలపడుతున్నారు.



బాలుర డబుల్స్‌లో తలపడుతున్న రంగారెడ్డి జట్టు

ఫైనల్స్‌కు చేరిన జట్లు..

బాలికల సింగిల్స్ విభాగంలో కీర్తి మంచాల(వరంగల్).. హాన్సిని (రంగారెడ్డి)పై 21-19, 14-21, 21-12 పాయింట్ల తేడాతో గెలుపొంది ఫైనల్‌కు చేరుకుంది. అక్షయ చౌదరి (మెదక్).. అవినిరెడ్డి(రంగారెడ్డి) పై 21-17, 21-13 పాయింట్లతో గెలుపొంది ఫైనల్‌కు చేరుకుంది

మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో..

ఆదిత్య హర్షవర్దన్, రిషిత పాండే(రంగారెడ్డి) జట్టు సాయినటకేశ్, మాడ్గుల పూజిత(వరంగల్) జట్టుపై16-21, 21-16, 21-12 పాయింట్ల తేడాతో విజయం సాధించారు.

బాలుర సింగిల్స్ ..

శశాంక్ వనమాల(రంగారెడ్డి).. అలీసిద్దిక్ (వరంగల్)పై 21-10, 15-21, 21-11 పాయింట్ల తేడాతో గెలుపొంది ఫైనల్‌కు చేరుకున్నాడు.

బాలుర డబుల్స్..

ధ్రువ్‌పర్షద్, వివేక్(రంగారెడ్డి) జట్టు ఆదిత్యారెడ్డి, శ్రీవర్ధన్‌గౌడ్ (మెదక్)జట్టు పై 24-22, 21-11 పాయింట్లతో విజయం సాధించారు. పోటీలను బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్. రమేశ్ కుమార్, పి. రమేశ్‌రెడ్డి, ట్రెజరర్ డి. నాగకిషన్, నిర్వహణ కార్యదర్శి ఎం. జితేందర్ రెడ్డి పర్యవేక్షించారు.

నేడు కాళేశ్వరానికి బీఆర్‌ఎస్ బృందం

- ఉదయం 9 గంటలకు కన్నెపల్లికి.. అనంతరం మేడిగడ్డకు
- కేటీఆర్, హరీశ్‌తోపాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు
- పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టును బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర బృందం శుక్రవారం సందర్శించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఉదయం 8గంటలకు పెద్దపల్లి జిల్లా రామగుండంలో అల్పాహారం చేస్తారు. 9 గంటలకు కన్నెపల్లి పంప్ హౌస్‌కు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం చేరుకుంటుంది. 10.30 గంటలకు మీడియా సమావేశం నిర్వహిస్తారు. ఉదయం 11.30 గంటలకు మేడిగడ్డ (లక్ష్మి) బరాజ్‌ను పరిశీలిస్తారు. అనంతరం మీడియాతో సమావేశం ఉంటుంది. మధ్యాహ్నం 2 గంటలకు మంచిర్యాల జిల్లా చెన్నూర్‌లో భోజనం చేస్తారు. ఈపర్యటనలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు, తన్నీరు హరీశ్‌రావు, పార్టీ రాష్ట్ర ముఖ్య నాయకులు ప్రత్యేక బస్సుల్లో రానున్నారు. వారి కోసం పంప్‌హౌస్, బరాజ్‌ల్లో పరిస్థితిని వివరించడానికి ఇరిగేషన్‌శాఖ డీఈ స్థాయి అధికారిని ఏర్పాటు చేసినట్లు తెలిసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు భద్రత కట్టుదిట్టం చేస్తున్నట్లు తెలిసింది. 2022 జూలై 14న పంప్‌హౌస్ నీట మునిగిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి మరమ్మతుల్లో జాప్యం జరుగుతోంది. ఐదు మోటార్లు నీట మునిగి చెడిపోయాయి. గతేడాది అక్టోబర్ 21న మేడిగడ్డ బరాజ్‌లో 19, 20, 21 పియర్లు కుంగి, పగుళ్లు తేలిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ప్రభుత్వం ఎన్‌డీఎస్‌ఏ సూచనలతో పలు మరమ్మతులు, జియో ఫిజికల్, జియో టెక్నికల్ పరీక్షలు చేపట్టింది. ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో బరాజ్‌లో 8 లక్షల క్యూసెక్కుల వరద నీరు వృథాగా దిగువకు వెళ్తోంది. కన్నెపల్లి నుంచి ఎత్తిపోయాలనే ఆలోచనలతో బీఆర్‌ఎస్ బృందం ప్రాజెక్టుల పర్యటన చేస్తున్నట్లు తెలిసింది.

ఏసీబీకి చిక్కిన పరకాల సబ్ రిజిస్ట్రార్

- వారసత్వ భూమి రిజిస్ట్రేషన్‌కు రూ.80వేల లంచం డిమాండ్
- మధ్యవర్తిగా డాక్యుమెంట్ రైటర్
- లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అవినీతి నిరోధకశాఖ అధికారులు



ఏసీబీకి చిక్కిన పరకాల సబ్ రిజిస్ట్రార్ కె.సునీత, డాక్యుమెంట్ రైటర్ నరేష్



బాధితులు లాడే శ్రీనివాస్, శ్రీకాంత్

హన్మకొండ (పరకాల) : వారసత్వ భూమిని రిజిస్ట్రేషన్ చేయడానికి రూ.80వేల లంచం తీసుకుంటూ హనుమకొండ జిల్లా పరకాల సబ్ రిజిస్ట్రార్ కె.సునీత ఏసీబీ అధికారులకు పట్టుబడింది. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య కథనం ప్రకారం.. పరకాల సబ్‌రిజిస్ట్రార్ సునీత కొన్ని రోజుల నుంచి ప్రైవేట్ వ్యక్తుల ద్వారా లంచాలు తీసుకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఈ క్రమంలో పరకాల మున్సిపాలిటీ పరిధిలోని సీతారాంపురం గ్రామానికి చెందిన లాడే రాజేశ్వరరావు కుమారులు శ్రీనివాస్, శ్రీకాంత్ తమ తండ్రి పేరిట ఉన్న 1,173 గజాల భూమిని నాలుగు భాగాలుగా రిజిస్ట్రేషన్ చేయాలని డాక్యుమెంట్ రైటర్ బొట్ల నరేష్‌ను సంప్రదించారు. అతను సబ్ రిజిస్ట్రార్ సునీత దృష్టికి తీసుకువెళ్లగా ఒక్కో భాగానికి రూ.20వేల చొప్పున రూ.80వేలు ఇవ్వాలని డిమాండ్ చేసింది. అంత పెద్దమొత్తంలో లంచం ఇవ్వలేక శ్రీనివాస్, శ్రీకాంత్.. ఏసీబీ అధికారులను సంప్రదించారు. ఈ మేరకు పక్కా ప్రణాళిక ప్రకారం.. గురువారం బాధితులు డాక్యుమెంట్ రైటర్ నరేష్‌కు డబ్బులు అప్పగించారు. నరేష్ నుంచి సబ్‌రిజిస్ట్రార్ సునీత డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఇద్దరిని అరెస్ట్ చేశారు. వీరిని శుక్రవారం ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్లు డీఎస్పీ సాంబయ్య తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం ఆశిస్తే 1064 లేదా 91543 88912 నంబర్‌కు లేదా ఏసీబీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ దాడుల్లో ఏసీబీ ఎస్సైలు శ్యామ్,రాజు పాల్గొన్నారు.

బుద్ధారంలో విషాదఛాయలు

- దామెరతోగు ఎన్‌కౌంటర్‌లో బుద్ధారం వాసి నల్లమారి అశోక్ మృతి
- నాలుగు సంవత్సరాల క్రితం అజ్ఞాతంలోకి వెళ్లిన అశోక్



స్వగ్రామంలో అశోక్ ఇల్లు

గణపురం : భద్రాద్రికొత్తగూడెం-ములుగు జిల్లా సరిహద్దులోని దామెరతోగు ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు నేత నల్లమారి అశోక్ అలియాస్ విజేందర్(38) మృతి చెందినట్లు పోలీసులు గురువారం ప్రకటించారు. దీంతో అశోక్ స్వగ్రామం జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలోని బుద్ధారం గ్రామంలో విషాదం నెలకొంది. బుద్ధారం జీపీ పరిధి తిమ్మాపురం బీసీ కాలనీకి చెందిన నల్లమారి వీరస్వామి, రాజక్క దంపతుల మూడో సంతానం అశోక్. బుద్ధారం ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి వరకు చదువుకున్నాడు. అనంతరం డీసీఎం డ్రైవర్‌గా పని చేశాడు. ఈ క్రమంలో 2013లో పెళ్లి వారిని తీసుకెళ్తున్న క్రమంలో గణపురం మండలం మంజూర్‌నగర్ శివారులో డీసీఎం బోల్తా పడింది ఈ ప్రమాదంలో 6గురు మృతి చెందగా పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై భయాందోళనకు గురైన అశోక్ జనశక్తి పార్టీలో చేరాడు. పార్టీలో చేరిన కొద్ది రోజులకే పోలీసులకు చిక్కి అరెస్టయ్యాడు. అనంతరం కొద్ది రోజులు బయట ఉన్న అశోక్.. నాలుగు సంవత్సరాల క్రితం అజ్ఞాతంలోకి వెళ్లాడు. అశోక్ తల్లి రాజక్క 20 సంవత్సరాల క్రితమే మృతి చెందగా తండ్రి వీరస్వామి సంవత్సరం క్రితం మృతి చెందాడు. తండ్రి సంవత్సరికం రోజే కుమారుడు అశోక్ మృతి చెందడంతో బుద్ధారంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. అశోక్ సోదరుడు కుమారస్వామి ములుగు మండలం మహ్మద్‌గౌస్‌పల్లిలో నివాసం ఉంటుండగా, సోదరి భద్రమ్మ ఏటురునాగారం మండలం రొయ్యూరులో ఉంటుంది. సోదరుడు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడన్న విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతున్నారు. తమ్ముడి మృతదేహం అప్పగిస్తే అంత్యక్రియలు నిర్వహించుకుంటామని వారు పేర్కొంటున్నారు.

వర్షాలతో విద్యుత్ ఆస్తులకు నష్టం జరగొద్దు

- ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

హన్మకొండ : భారీ వర్షాలు, వరదల కారణంగా విద్యుత్ ఆస్తులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని టీజీఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశించారు. గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి ఎన్పీడీసీఎల్ పరిధిలోని అన్ని సర్కిళ్ల ఎస్ఈలు, డీఈలు, ఎస్ఏఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సబ్‌స్టేషన్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ముంపుకు గురికాకుండా ఎత్తు పెంచాలన్నారు. మున్సిపాలిటీ, నగర పరిధిలో 11 కేవీ ఫీడర్లను రింగ్ మెయిన్ సిస్టంగా మార్పు చేసుకుంటే సమస్య తలెత్తిన వెంటనే మరో ఫీడర్ ద్వారా సరఫరా అందించి విద్యుత్ అంతరాయాలు తగ్గించొచ్చన్నారు. పాల్వంచలో 11 కేవీ లైన్లకు ఇన్సులేటెడ్ స్లీవ్స్ ఏర్పాటు చేసే ప్రక్రియ మొదలైందన్నారు. ఇండ్ల పక్క నుంచి వెళ్లే విద్యుత్ లైన్లకు వీటిని ఏర్పాటు చేయడం ద్వారా ప్రమాదాలు నివారించొచ్చన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్‌కుమార్, టి.సదర్‌లాల్, వి.తిరుపతిరెడ్డి, సీఈలు కె.కిషన్, రాజుచౌహాన్, జీఎంలు దేవేందర్, వేణుబాబు, అన్నపూర్ణ, అంకుష్, తదితరులు పాల్గొన్నారు.

జానపద విజ్ఞాన పీఠంలో ఎంఏ తెలుగు కోర్సు

హన్మకొండ కల్చరల్ : ఓరుగల్లు జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో 2024-25 సంవత్సరానికి గాను రెగ్యులర్ ఎంఏ తెలుగు కోర్సు ప్రవేశపెడుతూ తెలుగు విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ విడుదల చేసిందని జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి భూక్య బాబురావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న తెలుగు విశ్వవిద్యాలయం పలు పీజీ కోర్సుల్లో ప్రవేశాలు పొందడానికి నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ క్రమంలో తెలుగు విశ్వవిద్యాలయానికి సంబంధించిన మరో ప్రాంగణం వరంగల్ హంటర్‌రోడ్‌లోని జానపద గిరిజన విజ్ఞానపీఠంలో కూడా రెగ్యులర్ ఎంఏ తెలుగు కోర్సు అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ సందర్భంగా జానపద గిరిజన విజ్ఞాన పీఠం పీఠాధిపతి బాబురావు మాట్లాడుతూ ఈ కోర్సులో ఆసక్తి గల విద్యార్థులు ప్రవేశాలు పొందొచ్చని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, సాధారణ రుసుంతో ఆగస్టు 9వతేదీ వరకు, ఆలస్య రుసుంతో ఆగస్టు 19వ తేదీ వరకు తెలుగు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో WWW.teluguuniversity.ac.inలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

సాక్షి ఫ్యామిలీ IV
వరంగల్
శుక్రవారం ॥ 26-7-2024

పాలక్... పన్నీరు

మనసున్న పాట

పాలక్ ముచ్చల్ అనే పేరు వినిపించగానే తీయటి పాట ఒకటి గుర్తొస్తుంది సింగర్‌గా మంచి పేరు తెచ్చుకున్న పాలక్ సామాజిక సేవలోనూ తన వంతుగా కృషి చేస్తోంది. ఫండింగ్ ద్వారా ఇప్పటి వరకు మూడు వేల మంది పేద పిల్లలకు గుండె ఆపరేషన్‌లు చేయించింది.



బాలీవుడ్ సినిమా 'ఎంఎస్ దోని–ది అన్ టోల్డ్ స్టోరీ'లోని 'కౌన్ తుఝే' పాటతో ఎంతోమంది అభిమానులను సంపాదించుకుంది పాలక్. ఇండోర్‌కు చెందిన పాలక్‌కు కాలేజీ రోజుల నుంచి పాటతో పాటు సేవా బాటలో పయనించడం అంటే కూడా ఇష్టం.

పాలక్ తొలి ఫండ్ రైజింగ్ ప్రాజెక్ట్ కార్గిల్ వీర సైనికుల కోసం చేసింది. ప్రతి షాప్ ముందుకు వెళ్లి దేశభక్తి గీతాలు పాడి 'కార్గిల్ వీర సైనికులకు మీ వంతుగా సహాయం చేయండి' అని అడిగేది.

కళ, సామాజిక సేవను పాలక్ వేరు చేసి చూడదు. మూడు వేల మంది పేద పిల్లలకు గుండె ఆపరేషన్‌లు చేయించడానికి తనలోని కళ బలమైన మాధ్యమంగా ఉపయోగపడుతుందని చెబుతుంది పాలక్.

సినిమాల్లో అవకాశాలు దొరకని రోజుల్లో కూడా ఎన్నో ప్రోగ్రామ్స్ చేసి పేద పిల్లల కోసం విరాళాలు సేకరించేది.

పాలక్ ఒక మ్యూజిక్ ప్రోగ్రామ్ చేసిందంటే పది మంది పేద పిల్లల వైద్యానికి అవసరమైన డబ్బును సేకరించినట్లే. బాలీవుడ్‌లో సింగర్‌గా పాలక్‌కు మంచి పేరు రావడమే కాదు ఆ పేరు విరాళాల సేకరణకు బాగా ఉపయోగపడింది.

'మీ పాట అద్భుతం' అనే ప్రశంస కంటే, పేదింటి తల్లిదండ్రుల గొంతు నుంచి వినిపించే...

'మీ వల్ల మా బిడ్డ బతికింది' అనే మాట పాలక్‌కు ఎక్కువ సంతృప్తి ఇస్తుంది. ఇప్పుడు పాలక్ వెయిటింగ్ లిస్ట్‌లో 413 మంది పిల్లలు ఉన్నారు. వారికి హార్ట్ సర్జరీలు చేయించాల్సిన బాధ్యతను భుజాలకెత్తుకుంది.

'మనస్ఫూర్తిగా కోరుకుంటే అంతా మంచే జరుగుతుంది. పేదపిల్లలకు అండగా నిలవడానికి ఇది దేవుడు ఇచ్చిన అవకాశంగా భావిస్తాను' అంటుంది పాలక్ ముచ్చల్.

ఫ్యాషన్








గ్రామీణ మహిళా కళాకారులను ప్రోత్సహించడానికి, వారి వారసత్వ కళను, ఫ్యాబ్రిక్ క్రాఫ్ట్‌ను భారతదేశం అంతటా పరిచయం చేయడానికి ది వోవెన్ ల్యాబ్ పేరుతో కృషి చేస్తున్నారు భూపాల్ వాసి నిఖితా కౌశిక్. ముంబైలోని నిఫ్ట్ పూర్వవిద్యార్థి అయిన నిఖిత జీరోవేస్ట్ పాలసీతో పాతికమంది గ్రామీణ మహిళల చేత పట్టణ మహిళల కోసం ఆధునికంగా డ్రెస్‌లను డిజైన్ చేయించి, వారికి ఉపాధి కల్పిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 'స్టైల్ తత్త్వ' ఎగ్జిబిషన్‌లో క్రాఫ్ట్స్, హ్యాండ్లూమ్ క్లస్టర్స్‌కి వారధిగా ఉంటూ చేస్తున్న కృషిని వివరించారు.

సిటీకి పల్లె కళ

''ఈ రోజు మనం భారతీయులమని చెప్పుకోవడానికి గర్విస్తున్నామంటే మన దేశంలోని విభిన్న సంస్కృతులూ, సంప్రదాయాలూ కారణం. వేటికవి సొంత మార్గాలలో ప్రత్యేకమైనవి. ఫలితంగా మన జీవితంలో దుస్తులు ముఖ్యమైన అంశంగా మారాయి. మన గ్రామీణ మహిళా కళాకారుల హస్తకళ శిల్ప నైపుణ్యాన్ని చేతితో నేసిన వస్త్రాలను మరింత మెరుగుపరచడంలో మా పని కీలకంగా ఉంటుంది. చిట్ట చివరగా ఉపయోగించే చిన్న ఫ్యాబ్రిక్ పీస్‌తో కూడా 'కళ'ద్వారా అందంగా డిజైన్ చేస్తాం. ఇందుకోసం నిరంతరం పరిశోధన జరుగుతూనే ఉంటుంది. అందుకే, మా బ్రాండ్‌కు 'ది వోవెన్ ల్యాబ్' అని పేరు పెట్టాం.



నిఖితా కౌశిక్

జీరో వేస్ట్ పాలసీ

రాజస్థాన్, గుజరాత్ భోపాల్.. ప్రాంతాల్లోని గ్రామీణ, గిరిజన మహిళల చేతుల్లో రూపుదిద్దుకున్న మా దుస్తుల డిజైన్స్ బయట షాపుల్లో లభించవు. ఎగ్జిబిషన్లు, ఆన్‌లైన్ ద్వారా అమ్మకం చేస్తుంటాం. మన దేశీ కాలా పత్తితో పాటు టెన్సెల్, రీసైకిల్ ఫ్యాబ్రిక్స్, పర్యావరణ అనుకూలమైన క్లాత్‌తోనే డిజైన్ చేస్తున్నాం. అరుదైన కాటన్ ఫ్యాబ్రిక్, ప్రాచీన కళా వైభవం గల మోడర్న్ డిజైనరీ డ్రెస్సులు కాబట్టే వీటి ఖర్చు ఎక్కువే. కానీ, ఎక్కడ ఉన్నా ప్రత్యేకతను చాటుతుంటాయి.

మహిళా సాధికారత

మా సంస్థకు ఉన్న బలమైన స్తంభాలలో ఒకటి మహిళా సాధికారత. ఇప్పటికి పాతిక మంది గ్రామీణ మహిళలు ఈ డిజైన్స్ కోసం కృషి చేస్తున్నారు. కళ పట్ల ఆసక్తి ఉన్న గ్రామీణ బాలికలను ఎంపిక చేసుకొని, శిక్షణ ఇవ్వడమే కాకుండా, వారి ప్రాథమిక విద్య కూడా సవ్యంగా జరిగేలా చూస్తున్నాం. ఒక డ్రెస్ కొనుగోలు చేస్తే ఆ మొత్తంతో ఆ కళాకారుల ఇల్లు నెలంతా ఏ ఇబ్బంది లేకుండా గడిచిపోతుంది. భవిష్యత్తు తరాలు ఆ కళావైభవాన్ని సొంతం చేసుకోవాలన్నదే నా కల. చాలావరకు సేకరించే కాటన్ ఫ్యాబ్రిక్ ఐవరీ, గ్రే కలర్ వే ఎంచుకుంటాం. కొన్నింటికి మాత్రం నేచురల్ రంగులతో డైయింగ్ ప్రక్రియ ఉంటుంది. వ్యర్థాలను నివారిస్తూ, పర్యావరణ అనుకూలమైన ఉత్పత్తులను వెలుగులోకి తీసుకురావాలన్నదే మా ప్రయత్నం తప్ప ఫాస్ట్ ఫ్యాషన్ పోటీ పరుగులో చేరం.

రాబోయే తరాలకు మన కళ

ప్రాచీన హ్యాండ్ వర్క్స్‌ని వదిలేస్తే అవి అంతే సులువుగా మరుగున పడిపోతాయి. క్రాఫ్ట్స్ క్లస్టర్స్ ఆఫ్ ఇండియాతో అనుబంధంగా వర్క్ చేస్తున్నాను కాబట్టి దేశంలోని హ్యాండ్లూమ్ క్లస్టర్స్‌తోనూ, ఈ మార్గంలో వచ్చే అంతరాలను పూడ్చేందుకు నిఫ్ట్‌లోని వివిధ కేంద్రాలతో అనుబంధంగా వర్క్ చేస్తున్నాను.

ఫ్యాబ్రిక్ సేకరణ, డిజైన్స్ సృష్టి, వ్యర్థాలు మిగలకుండా జాగ్రత్తపడటం అనేది ఓ సవాల్‌గా ఉంటుంది. కానీ, పర్యావరణ హితంగా, మనసుకు నచ్చిన పని చేస్తుండటం ఎప్పుడూ ఉత్సాహాన్ని ఇస్తుంది. అంతేకాదు, ఈ డిజైన్స్‌ని ఇష్టపడి కొనుగోలు చేసేవారి ద్వారా ప్రాణం పెట్టే కళాకారులకు ఉపాధి పొందేలా చేయడం మరింత సంతృప్తిని ఇస్తుంది'' అని వివరించారు ఈ డిజైనర్.

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

వంటిల్లు

ఇది పకోడీ కాలం

ఇది వర్షాకాలం. వాన చినుకులు పడుతుంటే... వేడి వేడి పకోడీలు తింటూ గరం గరం చాయ్ తాగుతూ ఉంటే ఎలా ఉంటుంది? ఏడాదంతా వర్షాకాలమే ఉంటే బావుణ్ననిపిస్తుంది. ఇది వర్షాకాలం కాదు పకోడీల కాలం అనాలనిపిస్తుంది.



పోహా పకోడీ

కావలసినవి: అటుకులు– ఒకటిన్నర కప్పులు; బంగాళాదుంప– అర కప్పు (ఉడికించి చిదిమినది); కొత్తిమీర తరుగు – 2 టేబుల్ స్పూన్‌లు; పచ్చిమిర్చి తరుగు– టీ స్పూన్; మిరప్పొడి– టీ స్పూన్; చక్కెర – అర టీ స్పూన్; నిమ్మరసం – అర టీ స్పూన్; జీలకర్ర– అర టీ స్పూన్; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; నూనె– వేయించడానికి తగినంత.

తయారీ: ● అటుకులను ఒక పాత్రలో వేసి (అటుకులు తేలేటట్లు) నిండుగా నీటిని పోసి కడిగి వడపోత గిన్నెలో వేయాలి ● నీరంతా కారిపోయిన తర్వాత తీసి వెడల్పు పాత్రలో వేసుకోవాలి. అందులో ఉడికించి చిదిమిన బంగాళాదుంప, కొత్తిమీర, పచ్చిమిర్చి, మిరప్పొడి, చక్కెర, జీలకర్ర, నిమ్మరసం, ఉప్పు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమం అంతటినీ చిన్న నిమ్మకాయంత గోళీలుగా చేసుకోవాలి ● బాణలిలో నూనె వేడి చేసి, మరుగుతున్న నూనెలోఒక్కో గోళీని మెల్లగా వేయాలి. మంటను మీడియంలో పెట్టి దోరగా వేగనివ్వాలి. అన్నివైపులా ఎర్రగా వేగిన తర్వాత చిల్లుల గరిటతో తీసి టిష్యూ పేపర్ మీద వేస్తే పోహా పకోడీ రెడీ. వీటికి పుదీన చట్నీ లేదా టొమాటో కెచప్ మంచి కాంబినేషన్.



కార్న్ పకోడీ



కావలసినవి: స్వీట్ కార్న్ గింజలు– 2 కప్పులు; అల్లం వెల్లుల్లి పేస్ట్ – 2 టీ స్పూన్‌లు; జీలకర్ర– అర టీ స్పూన్; శనగపిండి– 3 టేబుల్ స్పూన్‌లు; బియ్యప్పిండి– 3 టేబుల్ స్పూన్‌లు; గరం మసాలా – అర టీ స్పూన్; ఉల్లిపాయ – ఒకటి (తరగాలి); పచ్చిమిర్చి – 2 (తరగాలి); కరివేపాకు – 2 రెమ్మలు; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; పసుపు – పావు టీ స్పూన్; మిరప్పొడి– అర టీ స్పూన్; నూనె – వేయించడానికి తగినంత.

తయారీ: ● మొక్కజొన్న గింజలను కడిగి చిల్లుల పాత్రలో వేసి నీరు పోయే వరకు ఉంచాలి ● ఈ లోపు ఒక పాత్రలో నూనె మినహా పైన తీసుకున్నవన్నీ వేసి కలపాలి ● మొక్కజొన్న గింజల్లో గుప్పెడు గింజలను తీసి పక్కన పెట్టి మిగిలిన గింజలను మిక్సీలో కచ్చపచ్చాగా గ్రైండ్ చేయాలి. ఇప్పుడు పక్కన పెట్టిన గింజలను కూడా శనగపిండి మిశ్రమంలో వేసి కలపాలి ● బాణలిలో నూనె మరిగించి పకోడీ మిశ్రమాన్ని చేతిలోకి తీసుకుని వేళ్లతో కొద్దికొద్దిగా నూనెలో వేయాలి. దోరగా వేగిన తర్వాత తీసి టిష్యూ పేపర్ మీద వేస్తే వేడి వేడి కార్న్ పకోడీలు తినడానికి రెడీ. ఇలాగే పిండినంతటినీ చేసుకోవాలి.

సినిమా

మహేశ్‌బాబు గోల్డ్?



హీరో మహేశ్‌బాబు, దర్శకుడు రాజమౌళి కాంబినేషన్‌లోని సినిమా అంతర్జాతీయ స్థాయిలో రూపొందనున్న సంగతి తెలిసిందే. దీంతో ఈ సినిమా ప్రతి అప్‌డేట్ ప్రపంచవ్యాప్త సినీ ప్రేమికులకు ఆసక్తికరంగా అనిపిస్తోంది. తాజాగా ఈ సినిమాకు 'గోల్డ్' అనే టైటిల్‌ను మేకర్స్ పరిశీలిస్తున్నారనే టాక్ ఫిల్మ్‌నగర్‌లో బలంగా వినిపిస్తోంది. గతంలో 'మహారాజా', 'మహారాజ్' వంటి పేర్లు తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే. లేటెస్ట్‌గా 'గోల్డ్' టైటిల్ వినిపిస్తోంది. ఆఫ్రికన్ ఫారెస్ట్ అడ్వెంచరస్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ సినిమా ప్రధాన కథాంశం ఓ నిధి వేట అనే వార్త ప్రచారంలోకి వచ్చింది. ఇప్పుడు ఈ సినిమాకు 'గోల్డ్' అనే టైటిల్‌ని పరిశీలిస్తున్నారనే వార్త రావడంతో నిధి నేపథ్యం కాబట్టి ఈ టైటల్‌నే ఖరారు చేస్తారనే చర్చ జరుగుతోంది. ఇక ఈ సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్ వర్క్‌ను రచయిత విజయేంద్ర ప్రసాద్ పూర్తి చేశారని, హైదరాబాద్‌లో సెట్ వర్క్ జరుగుతోందని, జర్మనీలో కొంత చిత్రీకరణను ప్లాన్ చేశారని తెలుస్తోంది. షూటింగ్‌ను ఈ ఏడాదిలోనే ప్రారంభించాలనుకుంటున్నారు మేకర్స్.

పాఠాలు నేర్పినవారందరికీ ధన్యవాదాలు



● శ్రుతీహాసన్

హీరోయిన్‌గా పదిహేనేళ్ల విజయవంతమైన కెరీర్‌ని పూర్తి చేసుకుంటూ, ఇంకా అగ్ర శ్రేణి హీరోయిన్ల జాబితాలో ఒకరిగా రాణిస్తుండటం అంటే అంత సులభమైన విషయం కాదు. ఈ లిస్ట్‌లో చాలా తక్కువమంది హీరోయిన్లు ఉంటారు. తాజాగా శ్రుతీహాసన్ పేరు ఈ లిస్ట్‌లో చేరింది. తండ్రి కమల్‌హాసన్ నటించిన ద్విభాషా (తమిళం, హిందీ) చిత్రం 'హే రామ్' (2000)లో చైల్డ్ ఆర్టిస్టుగా తొలిసారి స్క్రీన్‌పై కనిపించారు శ్రుతీహాసన్. చైల్డ్ ఆర్టిస్టుగా మరో సినిమా చేయలేదు కానీ.. 'హే రామ్' రిలీజైన తొమ్మిదేళ్లకు హిందీ చిత్రం 'లక్' (2009)తో కథానాయికగా కెరీర్‌ను ఆరంభించారు శ్రుతి. ఆ తర్వాత సూర్య 'సెవెన్త్ సెన్స్', ధనుష్ 'త్రీ', రామ్ చరణ్ 'ఎవడు', అల్లు అర్జున్ 'రేసుగుర్రం' రవితేజ 'క్రాక్' .. ఇటీవల చిరంజీవి 'వాల్తేరు వీరయ్య', ప్రభాస్ 'సలార్: సీజ్‌ఫైర్' వంటి చిత్రాలతో ప్రేక్షకులను మెప్పించారు శ్రుతి. నటిగా–గాయనిగా–సంగీత దర్శకురాలిగా... ఇలా మల్టీ టాలెంట్‌తో దూసుకెళుతున్నారు శ్రుతీహాసన్. కథానాయికగా పదిహేనేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శ్రుతీహాసన్ స్పందిస్తూ – ''అప్పుడే పదిహేనేళ్లు పూర్తయ్యాయంటే నమ్మశక్యంగా లేదు. నేను పెరిగిన మ్యాజికల్ ఇండస్ట్రీలోనే ఇంతకాలం నేను ఉన్నందుకు చాలా సంతోషంగా ఉంది. నా మిగతా జీవితాన్ని కూడా ఇండస్ట్రీతోనే ముడివేస్తాను. ఇండస్ట్రీలో నాకు అందమైన పాఠాలు నేర్పినవారందరికీ ధన్యవాదాలు. అలాగే నన్ను ఆదరించిన ప్రేక్షకులు, నా అభిమానులకు థ్యాంక్స్. వీళ్లే లేకపోతే నేను ఇలా ఉండేదాన్ని కాదు'' అన్నారు. రజనీకాంత్ 'కూలీ', ప్రభాస్ 'సలార్: శౌర్యంగాపర్వం', అడవి శేష్ 'డెకాయిట్' చిత్రాల్లో నటిస్తున్నారు శ్రుతీహాసన్.

తనికెళ్ల భరణికి డాక్టరేట్



ప్రముఖ నటుడు, రచయిత, దర్శకుడు తనికెళ్ల భరణికి వరంగల్ ఎస్ఆర్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించింది. తనికెళ్ల భరణి దాదాపు 800లకు పైగా సినిమాల్లో నటించి ప్రేక్షకుల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 52 సినిమాలకు మాటలు అందించారాయన. 'సముద్రం' సినిమాకి ఉత్తమ విలన్‌గా, 'నువ్వు నేను' చిత్రానికి ఉత్తమ క్యారెక్టర్ ఆర్టిస్టుగా, 'గ్రహణం' చిత్రంతో ఉత్తమ నటునిగా, 'మిథునం' సినిమాకిగాను ఉత్తమ రచయిత–ఉత్తమ దర్శకునిగా నంది అవార్డులు అందుకున్నారాయన. ఇక ఆగస్ట్ 3న వరంగల్‌లో జరిగే యూనివర్సిటీ స్నాతకోత్సవంలో తనికెళ్ల భరణికి డాక్టరేట్‌ను ప్రదానం చేయనున్నారు.

మళ్లీ తల్లి కాబోతున్నాను



'ఏం పిల్లో ఏం పిల్లడో', 'బావ', 'పాండవులు పాండవులు తుమ్మెద, రభస, బ్రహ్మోత్సవం' వంటి సినిమాల్లో నటించిన ప్రణీత తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలే. ఇక వ్యక్తిగత విషయానికి వస్తే... 2021 మే 30న వ్యాపారవేత్త నితిన్ రాజుతో ప్రణీత వివాహం జరిగింది. 2022 జూన్‌లో ప్రణీత ఓ పాపకు జన్మనిచ్చారు. కొన్ని నెలలు సినిమాలకు విరామం తీసుకున్నాక ఆమె కన్నడలో చేసిన ఒక సినిమా, మలయాళంలో చేసిన ఒక సినిమా ఈ ఏడాది విడుదలయ్యాయి. కాగా తాను రెండోసారి తల్లి కాబోతున్నట్లు పేర్కొన్నారు. 'రౌండ్ 2.. ఇప్పటి వరకూ నేను వాడిన పాంట్స్ ఇక నాకు ఫిట్ కావు'' అంటూ బేబీ బంప్ ఉన్న ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు ప్రణీత.


● ప్రణీత

హారర్... థ్రిల్



● ప్రియా భవానీ శంకర్

అరుళ్ నిధి, ప్రియా భవానీ శంకర్ జంటగా నటించిన తమిళ చిత్రం 'డీమాంటీ కాలనీ 2'. అజయ్ ఆర్. జ్ఞానముత్తు దర్శకత్వం వహించారు. విజయ సుబ్రహ్మణ్యన్, ఆర్.సి.రాజ్ కుమార్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్టులో విడుదల కానుంది. రాజ్ వర్మ ఎంటర్‌టైన్‌మెంట్– శ్రీ బాలాజీ ఫిలింస్ తెలుగులో విడుదల చేస్తున్నాయి. ఈ చిత్రం ట్రైలర్‌ను దర్శకుడు రామ్ గోపాల్ వర్మ రిలీజ్ చేసి, 'ట్రైలర్ ఆసక్తిగా ఉంది. సినిమా హిట్టవ్వాలి' అన్నారు. కాగా అజయ్ ఆర్. జ్ఞానముత్తు దర్శకత్వంలో వచ్చిన 'డీమాంటీ కాలనీ'కి సీక్వెల్‌గా 'డీమాంటీ కాలనీ 2' రూపొందింది. ''హారర్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం ఇది. డీమాంటీ ఇంట్లో అనూహ్యమైన ఘటనలు జరుగుతుంటాయి. ఆ ఇంట్లో ఏం జరుగుతుందో తెలుసుకునేందుకు వెళ్లిన వారు చనిపోతుంటారు. ఇంతకీ ఆ ఇంట్లో ఉన్న ఆ శక్తి ఏంటి? చివరగా వెళ్లినవారు ఎలా ప్రాణాలు కాపాడుకున్నారు?' అనేది 'డీమాంటీ కాలనీ 2'లో ఆసక్తిగా ఉంటుంది'' అన్నారు మేకర్స్.



● రాజ్ తరుణ్, మాల్వీ మల్హోత్రా

తెగబడవేమీ...

రాజ్ తరుణ్, మాల్వీ మల్హోత్రా జంటగా ఏఎస్ రవి కుమార్ చౌదరి దర్శకత్వం వహించిన చిత్రం 'తిరగబడరసామీ'. మల్కాపురం శివకుమార్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్ట్ 2న రిలీజ్ కానుంది. తాజాగా ఈ చిత్రం టైటిల్ సాంగ్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. 'కత్తులు దిగనీ నెత్తురుతోని తడపర భూమి తెగబడవేమీ...' అంటూ సాగే ఈ పాటకి జేబీ సంగీతం అందించారు. సుద్దాల అశోక్ తేజ సాహిత్యం అందించిన ఈ పాటని సాయి చరణ్, లోకేశ్వర్ ఈదర, చైతు సత్సంగి పాడారు. ''యూత్‌ని ఆకట్టుకునే రొమాన్స్‌తో పాటు ఫ్యామిలీని ఆకర్షించే సెంటిమెంట్, మాస్‌ని అలరించే హై ఓల్టేజ్ యాక్షన్ అంశాలతో 'తిరగబడర సామీ' రూపొందింది. టీజర్, ట్రైలర్, పాటలు సినిమాపై క్యూరియాసిటీని పెంచాయి'' అని చిత్రబృందం పేర్కొంది.

రక్షించండి!



● 'ఫిర్ ఆయీ హసీన్ దిల్‌రుబ' పోస్టర్

తాప్సీ నటించిన రొమాంటిక్ థ్రిల్లర్ మూవీ 'హసీన్ దిల్‌రుబ' (2021) హిట్టయిన విషయం తెలిసిందే. విక్రాంత్ మెస్సీ మరో లీడ్ రోల్‌లో నటించిన ఈ సినిమాకు వినీల్ మాథ్యూ దర్శకత్వం వహించారు. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'ఫిర్ ఆయీ హసీన్ దిల్‌రుబ' రూపొందింది. సీక్వెల్‌లోనూ తాప్సీ, విక్రాంత్ మెస్సీ లీడ్ రోల్స్‌లో నటించగా, వినీల్ మాథ్యూయే దర్శకత్వం వహించారు. ఈ సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. 'నాతో కలిసి నువ్వు సినిమాకు వస్తావా?' 'నన్ను రక్షించండి... నా భర్త నన్ను చంపబోతున్నాడు' అనే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. ఈ చిత్రం ఆగస్టు 9 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది.

సినిమా బాగుందని అంటారు



● మహేంద్రనాథ్

''సమాజంలోని ఒక అంశానికి వాణిజ్య అంశాలు జోడించి 'విరాజి' తీశాం. ఈ సినిమాలో మంచి కంటెంట్ ఉంది. సినిమా చూసిన ప్రతి ఒక్కరూ బాగుందని అంటారనే నమ్మకం ఉంది'' అని నిర్మాత మహేంద్రనాథ్ కూండ్ల అన్నారు. వరుణ్ సందేశ్ హీరోగా నటించిన చిత్రం 'విరాజి'. ఆద్యంత్ హర్ష దర్శకత్వంలో మహేంద్రనాథ్ కూండ్ల నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా మహేంద్రనాథ్ మాట్లాడుతూ– ''వరలక్ష్మితో 'శబరి' సినిమా తర్వాత మా సంస్థలో నిర్మించిన రెండో చిత్రం 'విరాజి'. ఆద్యంత్ హర్ష చెప్పిన కథని అంతే బాగా తెరకెక్కించారు. వరుణ్ సందేశ్ అమెరికా నేపథ్యం ఉన్న వ్యక్తి. అతని డైలాగ్ డెలివరీ విధానం 'విరాజి'కి కలిసొచ్చింది. మా సినిమాని మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ వాళ్లు నైజాంలో రిలీజ్ చేస్తున్నారు'' అన్నారు.

ఏమైందో మనసే...



● పవన్, సాహిబా

'మెరిసే మెరిసే' చిత్ర దర్శకుడు పవన్ కుమార్ కొత్తూరి హీరోగా నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'యావరేజ్ స్టూడెంట్ నాని'. స్నేహా మాలవ్య, సాహిబా భాసిన్, వివియా సంత్ హీరోయిన్లుగా నటించారు. శ్రీ నీలకంఠ మహదేవ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఎల్ఎల్‌పీపై రూపొందిన ఈ చిత్రం పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ ద్వారా ఆగస్ట్ 2న విడుదల కానుంది. కాగా 'ఏమైందో మనసే' అంటూ సాగే ఈ చిత్రంలోని రెండో పాటను రిలీజ్ చేశారు. ఈ పాటకు కార్తీక్ బి. కొడకండ్ల సంగీతం అందించారు. కృష్ణవేణి మల్లవజ్జల సాహిత్యం అందించగా, శక్తి శ్రీ గోపాలన్ పాడారు.